మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 200 | శుక్రవారం | 23 - 01 - 2026 | పేజీలు: 8 | వెల: 4

## జగన్‌కు క్రెడిట్ మాటలు విడ్డూరం



3లో..

## పరీక్షల నిర్వహణలో పారదర్శకత, నాణ్యతకు

# పెద్ద అడుగు

- ☐ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో పరీక్షల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం
- ☐ ఆధునిక సాంకేతికతతో ఒకే వేదిక నుంచి పర్యవేక్షణ
- ☐ డా. యెల్లాప్రగడ సుబ్బారావుకు ఘన నివాళులు
- ☐ మంత్రి సత్య కుమార్ యాదవ్



మన గళం, విజయవాడ : విజయవాడలోని డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్లో వైద్య విద్య పరీక్షల నిర్వహణలో పారదర్శకత, నాణ్యతను మరింత పెంచే దిశగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఫర్ ఎగ్జామ్ ప్రాక్టరింగ్ కేంద్రాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా యూనివర్సిటీ పరిధిలో జరిగే అన్ని పరీక్షలను ఒకే వేదిక నుంచి పర్యవేక్షించేలా ఆధునిక సాంకేతిక వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీసీటీవీ పర్యవేక్షణ, ప్రత్యక్ష ప్రసారం, డేటా విశ్లేషణ, పరీక్ష భద్రతకు సంబంధించిన హెచ్చరిక వ్యవస్థలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా పరీక్షల నిర్వహణలో మానవ తప్పిదాలకు తావు లేకుండా చేయడంతో పాటు, వైద్య విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన పరీక్షలను పూర్తిగా నిష్పక్షపాతంగా, సాంకేతికంగా సమర్థంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని మంత్రి తెలిపారు.

రాష్ట్రాన్ని వైద్య విద్యలో దేశానికి ఆదర్శంగా నిలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతికత వినియోగంతో పరీక్షా సంస్కరణలు మరింత బలోపేతం అవుతాయని, విద్యా ప్రమాణాలు ఉన్నత స్థాయికి చేరతాయని పేర్కొన్నారు. అంతకుముందు యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త డా. యెల్లాప్రగడ సుబ్బారావు విగ్రహానికి మంత్రి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. వైద్య, శాస్త్ర రంగాలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆవిష్కరణలు నేటికీ కోట్లాది మంది ప్రాణాలను



కాపాడుతున్నాయని మంత్రి కొనియాడారు.



## ప్రారంభం కాకముందే

# కూలిన వాటర్ ట్యాంక్

- 33 గ్రామాలకు తాగునీరు లక్ష్యంగా రూ.21 కోట్ల నిర్మాణం
- ట్రయల్ రన్‌లోనే పేకమేడలా కుప్పకూలిన కట్టడం
- నాసిరకం సామగ్రి వాడకంపై అనుమానాలు

మన గళం, సూరత్ : గుజరాత్ రాష్ట్రం గుజరాత్లోని సూరత్ జిల్లా పరిధిలో 33 గ్రామాలకు రక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన భారీ వాటర్ ట్యాంక్ ప్రారంభం కాకముందే కూలిపోయింది. రూ.21 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పాలకుల అవినీతి, నిర్మాణ లోపాల కారణంగా నేలమట్టమైందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గాయ్‌పగ్లా గ్రూపు వాటర్ సప్లై స్కీమ్ కింద మాండ్వి తాలూకాలోని తాడ్‌కేశ్వర్ గ్రామంలో ఈ ఘటన

2లో..

## జగన్ కలవరానికి కారణం

# లిక్కర్ స్కామ్ భయమే



- విజయసాయి ఈడీ విచారణలో ఏమి చెప్పారోనన్న ఆందోళన
- అసత్య ప్రచారాలతో ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం

మన గళం, అమరావతి : వైసీపీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ విచారణ ఎదుర్కొన్న మాజీ ఎంపీ

2లో..

## ఆంధ్రప్రదేశ్ ప్రయాణికులకు

# అమృత్ భారత్ రైలు శుభవార్త



- చర్లపల్లితిరువనంతపురం మధ్య కొత్త సర్వీస్ - ఏపీలో కీలక స్టేషన్లకు హాల్ట్‌లు

మన గళం డెస్క్ : ఆంధ్రప్రదేశ్ ప్రయాణికులకు భారతీయ రైల్వే శాఖ శుభవార్త అందించింది. తెలంగాణలోని చర్లపల్లి నుంచి కేరళ రాజధాని తిరువనంతపురం వరకు కొత్తగా అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ కొత్త రైలు సేవను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం తిరువనంతపురంలో జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ రైలు ప్రారంభంతో దక్షిణ భారతదేశంలో రైల్వే

2లో..

## బీసీలకు పూర్తి న్యాయం

# చేస్తున్న ప్రజా ప్రభుత్వం



- బీసీ ముఖ్యమంత్రి అయ్యే సమయం తప్పక వస్తుంది
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం
- దేవుళ్ల పేరుతో రాజకీయాలు సరికాదు: మహేశ్ గౌడ్

మన గళం, హైదరాబాద్ : కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం బీసీలకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ నేత ముఖ్యమంత్రి అయ్యే సమయం తప్పకుండా వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో బీసీలకు మరిన్ని

2లో..

## క్వాంటమ్ కంప్యూటింగ్‌లో

# ఏపీ చారిత్రక ముందడుగు

- 2026 జులై నాటికి అమరావతిలో దక్షిణాసియాలోనే శక్తివంతమైన క్వాంటమ్ కంప్యూటర్

మన గళం, దావోస్ : క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలక ముందడుగు వేయనుందని, 2026 జులై నాటికి దక్షిణాసియాలోనే అత్యంత శక్తివంతమైన క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో ఆవిష్కరించనున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం వార్షిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా, "నైపుణ్యాలు, సహకారంతో క్వాంటమ్ ఆవిష్కరణలను వేగవంతం చేయడం" అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో ఆయన

2లో..



## క్రెడిట్ కార్డ్ వడ్డీలపై నియంత్రణ అవసరం


- ☐ అధిక వడ్డీలు, పెనాల్టీలతో వినియోగదారులపై ఆర్థిక భారం
- ☐ భారతదేశంలో గరిష్ఠ పరిమితి విధించాల్సిన అవసరం
- ☐ కేంద్ర ఆర్థిక మంత్రికి వినతిపత్రం

మన గళం, న్యూఢిల్లీ : భారతదేశంలో క్రెడిట్ కార్డ్ వినియోగదారులపై విధిస్తున్న అధిక వడ్డీ రేట్లు, పెనాల్టీ ఛార్జీలపై నియంత్రణ అవసరమని బీజేపీ నేత దగ్గుబాటి పురంధేశ్వరి స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో క్రెడిట్ కార్డులపై 24 శాతం నుంచి 48 శాతం వరకు, కొన్ని సందర్భాల్లో 55 శాతం కంటే ఎక్కువ వార్షిక వడ్డీ రేట్లు విధించడం వల్ల సాధారణ ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆమె పేర్కొన్నారు. వినియోగదారులను దోపిడీ రుణ విధానాల నుంచి రక్షించాలనే ఉద్దేశంతో అమెరికాలో క్రెడిట్ కార్డ్ వడ్డీ రేట్లను గరిష్ఠంగా 10 శాతానికి పరిమితం చేసే ప్రతిపాదన ముందుకు వచ్చిందని పురంధేశ్వరి గుర్తు చేశారు. ఇలాంటి సంస్కరణలపై భారత్ కూడా ఆలోచించాల్సిన అవసరం

2లో..



# ప్రారంభం కాకముందే కూలిన వాటర్ ట్యాంక్



చోటుచేసుకుంది. 11 లక్షల లీటర్ల నిల్వ సామర్థ్యంతో, 15 మీటర్ల ఎత్తుతో నిర్మించిన ట్యాంక్‌కు సోమవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద శబ్దంతో కట్టడం ఒక్కసారిగా కూలిపోయి స్థానికుల్లో తీవ్ర భయాందోళనను కలిగించింది. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు దాదాపు 9 లక్షల లీటర్ల నీటితో ట్యాంకును నింపినట్లు అధికారులు తెలిపారు. అయితే హఠాత్తుగా మొత్తం నిర్మాణం పేకమేడలా కూలిపోవడంతో నాసిరకం సామగ్రి వాడినట్టు ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ నాణ్యతపై పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఓ మహిళతో సహా ముగ్గురు కార్మికులు గాయపడగా, వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. వాటర్ ట్యాంక్‌కు ఇంకా ప్రారంభోత్సవం జరగకపోవడం, నివాస గృహాలకు తాగునీటి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# బీసీలకు పూర్తి న్యాయం చేస్తున్న ప్రజా ప్రభుత్వం

అవకాశాలు లభిస్తాయని, అవకాశం ఉన్న ప్రతి చోట బీసీలకు పదవులు ఇస్తూ పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. కష్టపడి పనిచేస్తే ఎవరి వాటా వాళ్లకు దక్కుతుందని, దీనిని ఎవ్వరూ అడ్డుకోలేరని మహేశ్ గౌడ్ అన్నారు. రాబోయే రోజులు అన్నీ బీసీలవేనని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పార్టీ కార్యాచరణ సాగుతోందన్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యలకు ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేయడం దేశానికి మంచిది కాదని, కులంమతం పేరుతో మన పిల్లలకు భవిష్యత్తు రాదని వ్యాఖ్యానించారు. రాముడు, అంజనేయుడి పేర్లు చెప్పి ఓట్లు దండుకోవడం సరికాదని విమర్శించారు. అర్వింద్ 'జై శ్రీరాం' అని మాత్రమే కాకుండా, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లి తాను చేసిన అభివృద్ధి ఏంటో వివరించి ఓట్లు అడగాలని హితవు పలికారు. రాముని పేరు చెప్పడం తప్ప నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏం చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. దేవుళ్లను రాజకీయాలతో ముడిపెట్టవద్దని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రయాణికులకు అమృత్ భారత్ రైలు శుభవార్త

కనెక్టివిటీ మరింత బలోపేతం కానుంది. ఈ సూపర్ ఫాస్ట్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ఆంధ్రప్రదేశ్‌లో సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట జంక్షన్‌లలో ఆగనుంది. దీంతో ఏపీ నుంచి కేరళ, తెలంగాణ ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగనుంది. అలాగే తెలంగాణలో నల్గొండ, మిర్యాలగూడ స్టేషన్లలో కూడా ఈ రైలుకు హాల్ట్‌లు ఏర్పాటు చేశారు. రైలు షెడ్యూల్ ప్రకారం, తిరువనంతపురం నుంచి ఉదయం 10:45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4:30 గంటలకు చర్లపల్లి జంక్షన్‌కు చేరుకుంటుంది. తెలంగాణకు మరో అమృత్ భారత్ రైలు కేటాయించినందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రైలు సేవ రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

సామాన్య, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని తక్కువ ధరలో సౌకర్యవంతమైన ప్రయాణం అందించాలనే లక్ష్యంతో భారతీయ రైల్వే శాఖ అమృత్ భారత్ రైళ్లను రూపొందించింది. ఇప్పటికే చర్లపల్లి నుంచి బీహార్‌లోని ముజఫర్‌పూర్ మధ్య ఒక అమృత్ భారత్ రైలు విజయవంతంగా సేవలు అందిస్తున్న సంగతి తెలిసిందే. కొత్త సర్వీస్ ప్రారంభంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రయాణికులకు ప్రయాణం మరింత సులభతరం కానుంది.

# క్రెడిట్ కార్డ్ వడ్డీలపై నియంత్రణ అవసరం

ఉందన్నారు. ఈ నేపథ్యంలో భారతదేశంలో కూడా క్రెడిట్ కార్డ్ వడ్డీ రేట్లు, పెనాల్టీ ఛార్జీలపై గరిష్ఠ పరిమితి విధించాలని ఆమె డిమాండ్ చేశారు. వినియోగదారుల హితాన్ని కాపాడేలా భారతీయ రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాలకు అనుగుణంగా కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు. అధిక వడ్డీల బారిన పడకుండా వినియోగదారులను రక్షించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

# క్వాంటమ్ కంప్యూటింగ్‌లో ఏపీ చారిత్రక ముందడుగు

ప్రసంగించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగమని మంత్రి తెలిపారు. 2024లో 1.3 బిలియన్ డాలర్లుగా ఉన్న ఈ మార్కెట్, 2030 నాటికి 41.8 శాతం వార్షిక సగటు వృద్ధి రేటుతో 20 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనాలు ఉన్నాయని వివరించారు. అయితే ఈ రంగానికి అవసరమైన నిపుణుల్లో ప్రపంచవ్యాప్తంగా మూడింట ఒక వంతు మాత్రమే అందుబాటులో ఉన్నారని, ఈ నైపుణ్య లోటును పూడ్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని ఐబీఎం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయనున్నట్లు లోకేశ్ వెల్లడించారు. 133-క్విట్ హెరాన్ ప్రాసెసర్‌తో కూడిన ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్2ను అమరావతిలో స్థాపించనుండగా, ఇది దేశంలోనే తొలి డెడికేటెడ్ క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్‌కు కేంద్రంగా నిలుస్తుందని తెలిపారు. 50 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఈ ఇన్నోవేషన్ జిల్లాలో అంతర్జాతీయ స్థాయి పరిశోధన కేంద్రాలు, ప్రముఖ కంపెనీలతో కలిసి పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు, 50 వేల మందికి పైగా శిక్షణ అందించే వ్యవస్థలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. 2026 జనవరి నాటికి 100 క్వాంటమ్ అల్గోరిథంలను, ఆగస్టు 15 నాటికి 100 క్వాంటమ్ వినియోగ కేసులను పరీక్షించడమే తమ లక్ష్యమని మంత్రి వెల్లడించారు. అమరావతి నుంచే క్వాంటమ్ కంప్యూటర్లను తయారు చేసి, ప్రపంచానికి ఎగుమతి చేయాలనే స్పష్టమైన దిశతో ముందుకెళుతున్నట్లు పేర్కొన్నారు.

**– మూడంచెల నైపుణ్యాభివృద్ధి ప్రణాళిక**

క్వాంటమ్ రంగంలో నైపుణ్యాల కొరతను అధిగమించేందుకు ఏపీ ప్రభుత్వం మూడంచెల వ్యూహాన్ని అమలు చేయనుందని లోకేశ్ తెలిపారు. తొలి దశలో 10 లక్షల మందికి క్వాంటమ్ అక్షరాస్యత కల్పించడం, రెండో దశలో పరిశ్రమలకు అవసరమైన నిపుణులను తయారు చేయడం, మూడో దశలో పరిశోధనలుఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ లక్ష మంది డెవలపర్లను సిద్ధం చేయడం ఈ ప్రణాళికలో భాగమని వివరించారు. ఈ రంగానికి కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ క్వాంటమ్ మిషన్' ద్వారా రూ.6,000 కోట్లతో మద్దతు ఇస్తోందని గుర్తు చేశారు.

**– ఏపీలో డబ్ల్యూఈఎఫ్ కేంద్రం**

దావోస్ పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్, వరల్డ్ ఎకనమిక్ ఫోరం గవర్నమెంట్ ఎఫైర్స్ హెడ్ మరూన్ ఖైరాజ్తో భేటీ అయ్యారు. ఏడాదిలోగా ఏపీలో డబ్ల్యూఈఎఫ్‌సీ4ఐఆర్ కేంద్రాన్ని కార్యాచరణలోకి తీసుకురావడంపై చర్చించారు. ఇంధన పరివర్తన, సైబర్ భద్రత, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాలపై ఈ కేంద్రం దృష్టి సారిస్తుందని తెలిపారు. గత ఏడాది నవంబర్‌లో కుదిరిన ఒప్పందం మేరకు ఈ కేంద్రాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామని ఖైరాజ్ హామీ ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు. ఈ ప్రయత్నాలన్నీ ఫలించి, దావోస్ చర్చలు వాస్తవ పెట్టుబడులుగా మారాలని ఆశిస్తున్నట్లు మంత్రి నారా లోకేశ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# జగన్ కలవరానికి కారణం లిక్కర్ స్కామ్ భయమే

విజయసాయి రెడ్డి ఏం వెల్లడించారోనన్న భయంతోనే జగన్ కలవరపడుతున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. ఈ కేసులో ఈడీ ముందు విజయసాయి తన పేరును ప్రస్తావించారా లేదా అన్న ఆందోళనతోనే జగన్ ప్రజల దృష్టిని మళ్లించేందుకు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. ప్రశాంతత కోల్పోయిన జగన్ తన వ్యక్తిగత భయాన్ని ప్రజల బాధగా చిత్రీకరిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. క్రెడిబిలిటీ లేని వ్యక్తి క్రెడిట్ చోరీ అంటూ మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. తన బురదను ఎదుటివారిపై చల్లే ప్రయత్నాలు జగన్ ఇంకా మానలేదని వ్యాఖ్యానించారు. ప్రజల ఆస్తులపై తన బొమ్మలు ముద్రించుకోవడం దురహంకారానికి నిదర్శనమని అన్నారు. పాసు పుస్తకాలపై రూ.700 కోట్ల ప్రజాధనం ఖర్చు చేసి తన ఫొటోలు వేసుకునే హక్కు జగన్‌కు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా రాష్ట్రంలో దోపిడీకి తెరలేపింది జగన్ ప్రభుత్వమేనని ఆరోపించారు. రీసర్వే, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మధ్య తేడా కూడా తెలియకుండా జగన్ మాట్లాడుతున్నారని విమర్శించారు. సొంత బాబాయిని హత్య చేసిన వారిని పార్టీలో చేర్చుకున్న వ్యక్తి జగన్ కాదా అని ప్రశ్నిస్తూ, రాజకీయ లబ్ధి తప్ప ప్రజా సంక్షేమం జగన్‌కు పట్టదని పయ్యావుల



కేశవ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ చిన్న ఘటన జరిగినా దానికి రాజకీయ రంగు పులిముతూ కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మంత్రి తీవ్రంగా ధ్వజమెత్తారు.

# మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ఈడీ విచారణ ముగింపు

**– హైదరాబాద్‌లో 7 గంటలపాటు సుదీర్ఘ ప్రశ్నలు – మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు కొనసాగింపు**

హైదరాబాద్, జనవరి 22 ,మన గళం,: ఏపీ మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎంపీ విజయసాయి రెడ్డిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణ ముగిసింది. హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు ఏడు గంటల పాటు అధికారులు ఆయనను సుదీర్ఘంగా ప్రశ్నించారు. విచారణ అనంతరం ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకుని పంపించారు. ఈడీ నోటీసుల మేరకు విచారణకు హాజరైన విజయసాయి రెడ్డిని పలు కోణాల్లో ప్రశ్నించినట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలైన మద్యం విధానం, మద్యం విక్రయాల ప్రక్రియ, నిధుల మళ్లింపు, ఈ వ్యవహారంలో మధ్యవర్తుల పాత్ర వంటి కీలక అంశాలపై అధికారులు ప్రశ్నలు సంధించారు. అధికారుల అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం లైసెన్సులు, డిస్ట్రిబ్యూషన్, విక్రయాల్లో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో సుమారు రూ.3,500 కోట్ల వరకు అక్రమ లావాదేవీలు జరిగినట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. ఈ ఆరోపణలపై సిట్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కోణంలో విచారణ చేపట్టింది. ఈ కేసులో విజయసాయి రెడ్డి నిందితుడిగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు స్పష్టం చేశారు. ఈ కుంభకోణంలో పాత్ర ఉన్న మరికొందరు నేతలు, మధ్యవర్తులపైనా దృష్టి సారించినట్లు సమాచారం. ఈ



పరిణామాలతో ఆంధ్రప్రదేశ్ రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# ఆర్టీసీ ఎండీని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ

**– పూల మొక్కతో ఆత్మీయ స్వాగతం**

శ్రీకాకుళం, జనవరి 22 మన గళం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సి.హెచ్. ద్వారకా తిరుమల రావు గురువారం ఉదయం శ్రీకాకుళం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా, జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పూల మొక్కను అందజేసి ఆర్టీసీ ఎండీకి ఆత్మీయ స్వాగతం పలికారు. జిల్లాలో ప్రజా సేవల మెరుగుదల, రవాణా భద్రత, సమన్వయంతో కూడిన పరిపాలనపై ఇరువురు సౌహార్ద వాతావరణంలో చర్చించారు. జిల్లా పోలీసు శాఖ ప్రజా భద్రతకు కట్టుబడి పనిచేస్తోందని, వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తామని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు.



## శ్రీ చౌడేశ్వరి దేవి తిరునాల క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల కరపత్రం విడుదల





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి తిరునాల క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల కరపత్రంను శ్రీ చౌడేశ్వరి దేవి తిరునాల క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల స్టీరింగ్ కమిటీ సభ్యులు గురువారం విడుదల చేశారు. కోడుమూరు పట్టణంలోని శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయం నందు పూజా కార్యక్రమం నిర్వహించి కార్యక్రమాలు విజయవంతంగా జరగాలని కోరుకుంటూ కరపత్రం విడుదల చేశారు. ఈ ఏడాది తిరునాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మొత్తం 18 కార్యక్రమాలు శ్రీ చౌడేశ్వరి దేవి తిరునాల సందర్భంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. మొదటగా 23 వ తేదీ న క్రికెట్ పోటీలతో ఈ క్రీడలు ప్రారంభం అవుతాయని తెలిపారు. వ్యాసరచన పోటీలు, ప్రకుత్వ పోటీలు, చిత్రలేఖనం పోటీలు, స్లో సైకిల్ పోటీలు, చదరంగం పోటీలు, ఉమ్మడి జిల్లా స్థాయిలో కబడ్డీ పోటీలు, ఓపెన్ టెన్నిస్ పోటీలు, గోనె సంచి తో పరిగెత్తే పోటీలు, వాలీబాల్ (బాలురు) , వాలీబాల్ (బాలికలు), రుచి తిండి వీరుల పోటీలు తప్పెట పోటీలు, చిన్నారి ముద్దు పాపల పోటీలు, ముగ్గుల పోటీలు, పొట్టేళ్ల పోటీలు మ్యూజికల్ చైర్ పోటీలు, డాన్స్ బేబీ డాన్స్ పోటీలు నిరహిస్తున్నట్లు స్టీరింగ్ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ ఏడాది కొత్తగా ప్రకృత్వ పోటీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా, రాజకీయాలకు అతీతంగా, అందరూ భాగస్వాములుగా శ్రీ చౌడేశ్వరి దేవి తిరునాల క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలను నిరహిస్తున్నట్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా ఈ కార్యక్రమాలను విజయవంతం చెయ్యాలని కోరారు. దాతల సహకారం తో ఈ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని విజ్ఞప్తి చేసారు.

## అక్షిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండల పరిధిలోని లద్దగిరి గ్రామంలో గురువారం సింగిల్ విండో ఛైర్మెన్ పట్టే కృష్ణుడు ఆధ్వర్యంలో తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. కెడిసిసి బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి , మీూా బొగ్గుల దస్తగిరి ఆదేశాల మేరకు, అక్షిత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రైతులకు 60

తైవాన్ స్ప్రేయర్ పంపులు పంపిణీ చేయడం జరిగింది. ముందు విష్ణువర్ధన్ రెడ్డి సహకారంతో ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేస్తామని రైతులకు హామీ ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సొసైటి డైరెక్టర్ గుడిసె జయరాముడు, పట్టే మధు, కొండాపురం,రామాపురం,అల్లినగరం టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## హిమాలయాల సెంటినెల్స్‌తో భేటీ

**– ఉత్తర భారత్ పరిధిలో ఆపరేషనల్ సిద్ధతల సమీక్ష – ట్రైపిక్స్ బ్రిగేడ్ సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి– ఆధునిక సాంకేతికతయుద్ధ నైపుణ్యాల సమన్వయం**

హిమాచల్ ప్రదేశ్, జనవరి 22, మనగళం : హిమాచల్ ప్రదేశ్‌లోని కఠినమైన పర్వత ప్రాంతాల్లో భారత సైన్యం ఆపరేషనల్ సిద్ధతలను సమీక్షించారు. ఉత్తర భారత్ బాధ్యతలు నిర్వహిస్తున్న డి.జి. మిశ్రా ట్రైపిక్స్ బ్రిగేడ్ సైనికులతో కలిసి పరిశీలన చేపట్టారు. హిమాలయాల ఎత్తైన ప్రాంతాల్లో ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఎదుర్కొనేలా సైన్యం సిద్ధంగా ఉందని ఈ సమీక్ష స్పష్టం చేసింది. సైనికులతో నేరుగా మాట్లాడిన లెఫ్టినెంట్ జనరల్, వారి దృఢ సంకల్పం, నిరంతర శిక్షణ, వినూత్న ఆలోచనలను ప్రశంసించారు. కఠిన వాతావరణంలోనూ విధి నిర్వహణలో వెనుకడుగు వేయని తీరును అభినందించారు. ఈ శిక్షణ విధానాలు సరిహద్దుల రక్షణలో కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.



ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ, యుద్ధ నైపుణ్యాలను మరింత పదునుపెట్టుకున్న ట్రైపిక్స్ బ్రిగేడ్ సైనికులు ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనే సామర్థ్యం కలిగి ఉన్నారని అధికారులు తెలిపారు. ఎత్తైన ప్రాంతాల్లో ఆపరేషన్లకు అవసరమైన లాజిస్టిక్స్, కమ్యూనికేషన్, మానవ వనరుల సిద్ధతపై సమగ్ర సమీక్ష జరిగింది.

దేశ రక్షణే లక్ష్యంగా, ఎప్పుడుఎక్కడైనా స్పందించే స్థాయిలో భారత సైన్యం సిద్ధంగా ఉందని ఈ సందర్భన మరోసారి నిరూపించింది. హిమాలయాల సెంటినెల్స్‌గా పేరుగాంచిన సైనికులు, సరిహద్దుల భద్రతకు అంకితభావంతో ముందుండి నడుస్తున్నారని సైనిక వర్గాలు వెల్లడించాయి.

## జగన్‌కు క్రెడిట్ మాటలు విడ్డూరం

- విద్యుత్ శాఖను సర్వనాశనం చేసినదే అసలు రికార్డు
- ప్రజలపై రూ.30 వేల కోట్ల భారం మోపిన పాలన
- రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చే దిశగా నడిపారు
- మంత్రి గొట్టిపాటి రవి కుమార్



అమరావతి, జనవరి 22 మన గళం : క్యారెక్టర్ లేని జగన్ క్రెడిట్ గురించి మాట్లాడటం పూర్తిగా విడ్డూరమని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తీవ్రంగా విమర్శించారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో రాష్ట్రానికి ఏ మేలు చేశారో ముందుగా చెప్పాలని, ప్రజలను మభ్యపెట్టే మాటలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

రాష్ట్రాన్ని అధోగతిపాలు చేయడంలో, ముఖ్యంగా విద్యుత్ శాఖను సర్వనాశనం చేయడంలోనే జగన్‌కు అసలు క్రెడిట్ ఉందని మంత్రి విమర్శించారు. ప్రజలపై సుమారు రూ.30 వేల కోట్ల భారాన్ని మోపడం, తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచడం, ఇప్పటికే కుదిరిన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేయడం వంటి నిర్ణయాలే ఆయన పాలనకు స్పష్టమైన నిదర్శనాలన్నారు.

మళ్లీ ఏ మోహంతో క్రెడిట్ గురించి మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. జగన్ కొనసాగి ఉంటే ఆంధ్రప్రదేశ్ అప్పుల కుప్పగా మారి, విద్యుత్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమయ్యేదని అన్నారు. అభివృద్ధి లేకుండా అప్పుల పాలననే కొనసాగించారని మండిపడ్డారు.

రాష్ట్రాన్ని చోరీ చేసిన వ్యక్తి ఇప్పుడు క్రెడిట్ చోరీ గురించి మాట్లాడితే ప్రజలు నవ్వుతున్నారని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వ్యాఖ్యానించారు. జగన్ పాలన ప్రజలకు గుర్తుండిపోయింది వైఫల్యాలతోనేనని, అదే నిజమైన రికార్డని ఆయన స్పష్టం చేశారు.

## వరుసగా 4 రోజులు బ్యాంకులు బంద్..

హైదరాబాద్ 22-01-2026 మన గళం,: జనవరి నెల చివరి వారంలో బ్యాంకు ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరుసగా 4 రోజుల పాటు బ్యాంకులు పనిచేయకపోవడంతో లావాదేవీలపై ప్రభావం పడే అవకాశం ఉంది. జనవరి 24 నాలుగో శనివారం కావడంతో బ్యాంకులు మూతపడతాయి. జనవరి 25 ఆదివారం సెలవు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ సెలవు కావడంతో బ్యాంకులు పనిచేయవు. దీంతో వరుసగా 3 రోజులు బ్యాంకు సేవలు నిలిచిపోతాయి.

ఇక జనవరి 27న కూడా బ్యాంకులు తెరుచుకునే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. బ్యాంకు ఉద్యోగులు వారానికి ఐదు పని దినాలు అమలు చేయాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ సమ్మె కారణంగా నాలుగో రోజూ బ్యాంకింగ్ కార్యకలాపాలు నిలిచే అవకాశం ఉందని సమాచారం. చెక్కుల క్లియరెన్స్, కౌంటర్ సేవలు, రుణాలకు సంబంధించిన పనులు ఆలస్యం కావచ్చు.అయితే డిజిటల్ లావాదేవీలపై ప్రభావం ఉండదు. యూపీఐ లావాదేవీలు, నెట్ బ్యాంకింగ్ సేవలు, మొబైల్ యాప్ లావాదేవీలు, నగదు యంత్రాల సేవలు యథావిధిగా కొనసాగుతాయి. నగదు ఉపసంహరణలు, ఆన్‌లైన్ బదిలీలు చేసుకోవచ్చు. కానీ కొత్త ఖాతా ప్రారంభం, చిరునామా నవీకరణ, బంగారు రుణాలు, ఇతర ప్రత్యక్ష బ్యాంకు సేవలు అవసరమైతే ఈరోజే పూర్తి చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## యూరోపియన్ యూనియన్ రాయబారులతో కీలక భేటీ

న్యూఢిల్లీ, జనవరి 22, మనగళం :యూరోపియన్ యూనియన్ దేశాల రాయబారులతో నిర్వహించిన సమావేశంలో ప్రపంచంలో పెరుగుతున్న అస్థిరత, అనిశ్చితి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగినట్లు విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో అస్థిరతే కొత్త సాధారణంగా మారిందని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా భారత్‌యూరోపియన్ యూనియన్ సంబంధాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని మంత్రి స్పష్టం చేశారు. బలమైన సరఫరా గొలుసులపై పరస్పర సహకారం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం కల్పించవచ్చని, విపత్తు సహాయక చర్యలు, సముద్ర దోపిడీ నిరోధక కార్యకలాపాలు, అభివృద్ధి ప్రాజెక్టుల వంటి ప్రజాప్రయోజన సేవల ద్వారా అంతర్జాతీయ సమాజానికి భరోసా ఇవ్వవచ్చని తెలిపారు.

వాణిజ్యం, వలసల సౌలభ్యం, భద్రతా భాగస్వామ్యం వంటి రంగాల్లో సమన్వయం పెంచడం ద్వారా ప్రపంచ క్రమానికి స్థిరత్వం తీసుకురావచ్చని జైశంకర్ అభిప్రాయపడ్డారు. ఈ దిశగా భారత్ మరియు యూరోపియన్ యూనియన్ కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.

రాబోయే గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ భారత్‌కు రానున్న నేపథ్యంలో, ఆ పర్యటన భారత్‌ఈయూ సంబంధాలకు మరింత బలం చేకూరుస్తుందని విదేశాంగ మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.



# రూ.2 లక్షలు ఉంటే చాలు..



హైదరాబాద్ 22-01-2026 :మన గళం : టాటా మోటార్స్ మరోసారి కార్ల మార్కెట్‌లో సంచలనం సృష్టిస్తోంది. ఒకప్పుడు ప్రజాదరణ పొందిన సియెర్రా మోడల్‌ను కొత్త డిజైన్, ఆధునిక సాంకేతికతతో మళ్లీ మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. ఆకర్షణీయమైన లుక్, ప్రీమియం అంతర్గత సదుపాయాలు, శక్తివంతమైన ఇంజిన్‌తో ఈ కారు కొనుగోలుదారులను ఆకట్టుకుంటోంది.

టాటా సియెర్రా ప్రారంభ ధర 11.49 లక్షలు కాగా, అత్యున్నత మోడల్ ధర 18.49 లక్షల వరకు ఉంటుంది. నగరం, షోరూమ్‌ను బట్టి ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు. అయితే కేవలం 2 లక్షల డౌన్ పేమెంట్ చెల్లిస్తే ఈ కారును సులభమైన నెలవారీ వాయిదాలపై సొంతం చేసుకోవచ్చు. తక్కువ ప్రారంభ పెట్టుబడితో కొత్త కారు కల సాకారం కావడం ఇదే ప్రధాన ఆకర్షణ. ఈ కారులో 1.5 లీటర్ల పెట్రోల్ ఇంజిన్ అమర్చారు. ఇది మంచి శక్తి, మైలేజ్ అందిస్తుంది. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ వెర్షన్లలో లభిస్తున్న ఈ మోడల్, ఈ ఏడాదిలో విద్యుత్ ఆధారిత వెర్షన్‌గా కూడా రానుంది. మృదువైన డ్రైవింగ్ అనుభూతి, విశాలమైన సీటింగ్, లగ్జరీ ఫీలింగ్ ఈ కారుకు ప్రత్యేకత. పొడవైన ప్రయాణాలకు ఇది చాలా అనుకూలంగా ఉంటుంది. భారత మార్కెట్‌లో ఈ కారు అదే విభాగానికి చెందిన ఇతర ప్రముఖ కార్లతో పోటీ పడుతోంది. ధర, భద్రత, బ్రాండ్ విశ్వసనీయత పరంగా టాటా సియెర్రాకు మంచి గుర్తింపు ఉంది. రెండు రకాల ఇంజిన్ ఎంపికలు అందుబాటులో ఉండటంతో వినియోగదారులు తమ అవసరాలకు అనుగుణంగా మోడల్‌ను ఎంచుకోవచ్చు. తక్కువ మొత్తంతో కొత్త కారు కొనాలనుకునే వారికి ఇది చక్కటి అవకాశం అని ఆటో నిపుణులు చెబుతున్నారు.

# ఐఫోన్ యూజర్లకు శుభవార్త..




హైదరాబాద్ జనవరి 22 ,మన గళం,: ఐఫోన్ వినియోగదారులకు ఆనందకరమైన వార్త వచ్చింది. ప్రముఖ సాంకేతిక సంస్థ ఆపిల్ తన డిజిటల్ చెల్లింపుల సేవను భారతదేశంలో ప్రారంభించేందుకు వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ సేవ కోసం అంతర్జాతీయ కార్డు నెట్‌వర్క్ సంస్థలతో చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం. త్వరలోనే భారత వినియోగదారులకు సురక్షితమైన, వేగవంతమైన చెల్లింపు సౌకర్యం అందుబాటులోకి రానుంది. ప్రారంభ దశలో ఈ సేవ కార్డు ఆధారిత స్పర్శలేని చెల్లింపులపై ప్రధానంగా దృష్టి పెట్టనుంది. వినియోగదారులు తమ ఫోన్ల ద్వారానే దుకాణాల్లో, సేవా కేంద్రాల్లో సులభంగా చెల్లింపులు చేయగలుగుతారు. తరువాతి దశలో దేశవ్యాప్తంగా విస్తృతంగా ఉపయోగంలో ఉన్న ఏకీకృత చెల్లింపు వ్యవస్థతో అనుసంధానం చేసే అవకాశాలు ఉన్నాయని టెక్ వర్గాలు చెబుతున్నాయి. ఈ కొత్త సేవ అందుబాటులోకి వస్తే ఐఫోన్ వినియోగదారులకు లావాదేవీలు మరింత సులభం కానున్నాయి. నగదు అవసరం లేకుండా, భద్రతతో కూడిన డిజిటల్ చెల్లింపులు చేయవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. డేటా భద్రత, వేగం, సౌలభ్యం కలిసిన ఈ సేవతో దేశంలో డిజిటల్ లావాదేవీల వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది.

# వారెవ్వా.. ఫోన్‌పేలో 5 లక్షల వరకు లోన్.. సింపుల్‌గా చేస్తే నిమిషాల్లోనే డబ్బు ఖాతాలో జమ..!




హైదరాబాద్ 22 జనవరి 2026,మన గళం : జేబులో చిల్లిగవ్వ లేకుండా అత్యవసరంగా డబ్బు కావాల్సిన పరిస్థితుల్లో బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇప్పుడు మొబైల్ ద్వారానే లోన్ పొందే అవకాశం వచ్చింది. రోజూ వినియోగించే ఫోన్‌పే యాప్ ద్వారా ఎలాంటి తాకట్టు లేకుండా 10000 నుంచి గరిష్ఠంగా 5 లక్షల వరకు వ్యక్తిగత రుణం పొందవచ్చు. ఇది పూర్తిగా డిజిటల్ విధానంలో జరుగుతుంది కాబట్టి ఇంటి నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత ఉన్నవారికి దరఖాస్తు ఆమోదం అయిన 72 గంటల్లోనే డబ్బు నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. లోన్ తిరిగి చెల్లించేందుకు 12 నుంచి 60 నెలల వరకు గడువు ఎంపిక చేసుకునే సౌలభ్యం ఉంటుంది. వడ్డీ రేటు 11.30 శాతం నుంచి 35 శాతం వరకు ఉండే అవకాశం ఉంది. 21 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు కలిగి నెలకు కనీసం 15000 ఆదాయం ఉన్నవారు ఈ లోన్‌కు అర్హులు. సిబిల్ స్కోర్ 650 కంటే ఎక్కువగా ఉంటే లోన్ వచ్చే అవకాశాలు మరింత పెరుగుతాయి.

దరఖాస్తు చేయడానికి ఆధార్ కార్డు, పాన్ కార్డు, గత 6 నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్, జీతభత్యాల స్లిప్పులు సిద్ధంగా ఉంచుకోవాలి. ఫోన్‌పే యాప్ ఓపెన్ చేసి లోన్లు అనే విభాగంలోకి వెళ్లి వ్యక్తిగత వివరాలు నమోదు చేసి అర్హతను పరిశీలించాలి. అనంతరం కావలసిన లోన్ మొత్తం, కాలపరిమితిని ఎంచుకుని అవసరమైన పత్రాలు అప్‌లోడ్ చేయాలి. ప్రాసెసింగ్ ఫీజు, నెలవారీ వాయిదాల వివరాలు ముందుగానే స్పష్టంగా కనిపిస్తాయి కాబట్టి దాచిన చార్జీలు ఉండవు.

సకాలంలో వాయిదాలు చెల్లిస్తే క్రెడిట్ స్కోర్ మెరుగుపడి భవిష్యత్తులో పెద్ద లోన్లు కూడా సులభంగా పొందే అవకాశం ఉంటుంది. వైద్య అవసరాలు, చిన్న వ్యాపార ఖర్చులు వంటి అత్యవసర పరిస్థితుల్లో ఈ సదుపాయం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారుతోంది.

# గ్రీన్‌లాండ్ ఉద్రిక్తతలు తగ్గుముఖం.. బలపడిన రూపాయి..!



ముంబై జనవరి 22 :మన గళం: చారిత్రాత్మక కనిష్ఠ స్థాయిల నుంచి భారత రూపాయి స్వల్పంగా కోలుకుంది. గ్రీన్‌లాండ్‌కు సంబంధించిన అంతర్జాతీయ ఉద్రిక్తతలు తగ్గడంతో మార్కెట్లలో నమ్మకం పెరిగింది. ఈ ప్రభావంతో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 15 పైసలు బలపడి 91.50 వద్ద ట్రేడవుతోంది. సమీప కాలంలో రూపాయి ఒడిదొడుకులు కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నప్పటికీ, ఇటీవలి రోజుల్లా వేగంగా పతనం ఉండకపోవచ్చని తెలిపారు. డీబీఎస్ బ్యాంక్ సీనియర్ ఆర్థిక నిపుణురాలు రాధికా రావు మాట్లాడుతూ ప్రపంచ మార్కెట్లలో భయ సూచిక పెరగడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, బాండ్ వడ్డీ రేట్లు అధికమవడం రూపాయిపై ఒత్తిడి పెంచాయని చెప్పారు. అయితే గ్రీన్‌లాండ్ ఉద్రిక్తతలు తగ్గడం మార్కెట్లకు ఊరటనిచ్చిందని వివరించారు. ఇక యూరోపియన్ యూనియన్‌తో కీలక వాణిజ్య ఒప్పందం త్వరలో ఖరారయ్యే అవకాశాలు ఉండటం, దావోస్ సమావేశాల్లో అమెరికాతో వాణిజ్య చర్చలపై సానుకూల సంకేతాలు రావడం కూడా రూపాయికి బలం చేకూరుస్తున్నాయి. దేశీయంగా ఆర్థిక వృద్ధి బలంగా కొనసాగుతున్నప్పటికీ, విదేశీ పెట్టుబడులు బయటకు వెళ్లడం వల్ల రూపాయిపై ఒత్తిడి కొనసాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి రెండు త్రైమాసికాల్లో సగటు వృద్ధి 8 శాతంగా నమోదైంది. మొత్తం సంవత్సరానికి వృద్ధి రేటు 7.5 శాతానికి పైగా ఉండవచ్చని అంచనా. అయితే ఈ ఏడాది ఇప్పటికే 3 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు ఈక్విటీ మార్కెట్ల నుంచి వెనక్కి వెళ్లడం ఆందోళనగా మారింది. కరెంట్ అకౌంట్ లోటు జీడీపీలో 1.0 నుంచి 1.2 శాతం పరిధిలోనే ఉన్నప్పటికీ, మూలధన ప్రవాహాలపై ఒత్తిడి కొనసాగుతోందని నివేదిక పేర్కొంది.

# మూడు రోజుల నష్టాలకు బ్రేక్.. మార్కెట్లకు ఊపిరి పోసిన లాభాల జోరు..!



ముంబై 22 జనవరి 2026 ,మన గళం : వరుసగా మూడు రోజులుగా నష్టాల్లో కొనసాగిన దేశీయ షేర్ మార్కెట్లకు గురువారం ఊరట లభించింది. అంతర్జాతీయంగా అనుకూల పరిణామాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం పెట్టుబడిదారుల నమ్మకాన్ని పెంచాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 397 పాయింట్లు పెరిగి 82307 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 132 పాయింట్ల లాభంతో 25289 వద్ద ముగిసింది. యూరప్ దేశాలపై ఫిబ్రవరి 1న కొత్త సుంకాలు విధించబోమని అమెరికా అధ్యక్షుడు ప్రకటించడం, భారత్‌తో బలమైన వాణిజ్య ఒప్పందంపై ఆశావహ వ్యాఖ్యలు కొనుగోళ్లకు ఊతమిచ్చాయి. అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఎస్‌బీఐ, టాటా స్టీల్ వంటి భారీ షేర్లలో కొనుగోళ్ల జోరు కనిపించగా, టైటాన్, మారుతీ సుజుకీ, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి కొన్ని షేర్లు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. రంగాల వారీగా పీఎస్‌యూ బ్యాంకులు, మీడియా రంగాలు 2 శాతం కంటే ఎక్కువ లాభాలతో ముందంజలో నిలిచాయి. మధ్యస్థ షేర్ల సూచీ 1.34 శాతం, చిన్న షేర్ల సూచీ 0.76 శాతం పెరిగాయి. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం నిఫ్టీ 25120 స్థాయి పైన నిలబడితే 25400 నుంచి 25500 దిశగా కదిలే అవకాశం ఉంది. అదే స్థాయి దిగువకు వెళ్లితే అమ్మకాల ఒత్తిడి పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

# బడ్జెట్‌లో క్రెడిట్ స్కోర్‌కు బూస్ట్.. అద్దె చెల్లింపులే గ్యారంటీగా మారనున్నాయా..?



హైదరాబాద్ 22 జనవరి , మన గళం : దేశంలో రుణాలు పొందాలంటే వ్యక్తి క్రెడిట్ స్కోర్ ప్రధాన ప్రమాణంగా మారింది. ఇప్పటివరకు లోన్లు సకాలంలో చెల్లించడం, కార్డ్ బిల్లులు కట్టడం, అప్పుల చరిత్ర వంటి అంశాల ఆధారంగానే ఈ స్కోర్ లెక్కిస్తున్నారు. అయితే ప్రతినెల క్రమంగా అద్దె చెల్లిస్తున్నా దానికి ఎలాంటి గుర్తింపు లేకపోవడం వల్ల లక్షలాది మంది రుణాల విషయంలో వెనుకబడుతున్నారు. ఈ పరిస్థితిని మార్చాలనే ప్రతిపాదన బడ్జెట్‌లో చర్చకు వచ్చింది.

నిపుణుల అభిప్రాయం ప్రకారం అద్దె అనేది ప్రతి కుటుంబానికి పెద్ద ఖర్చు. ఈ చెల్లింపులను డిజిటల్ విధానంలో నమోదు చేసి, వాటిని క్రెడిట్ స్కోర్‌లో పరిగణనలోకి తీసుకుంటే, కొత్తగా ఉద్యోగంలో చేరిన యువత, స్థిర ఆదాయం లేని స్వతంత్ర పనివాళ్లు, కొత్త నగరాలకు మారిన వారు కూడా సులభంగా రుణాలు పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు వారు బ్యాంకుల దృష్టిలో అధిక ప్రమాద వర్గంగా పరిగణింపబడుతున్నారు.

కొత్త విధానం అమల్లోకి వస్తే అద్దెను యూపీఐ లేదా బ్యాంకు మార్గంలో చెల్లించే వారి సమాచారం క్రెడిట్ సంస్థలకు చేరుతుంది. సకాలంలో అద్దె కట్టేవారి స్కోర్ పెరుగుతుంది. ఆలస్యం చేస్తే ప్రతికూల ప్రభావం ఉంటుంది. దీనివల్ల నగదు లావాదేవీలకు తగ్గుదల వచ్చి డిజిటల్ చెల్లింపులు మరింత పెరుగుతాయి. ప్రభుత్వంపై అదనపు భారం లేకుండానే సామాన్యులకు ఆర్థిక అవకాశాలు విస్తరిస్తాయి.

ఈ నిర్ణయం అమల్లోకి వస్తే ప్రతినెల అద్దె చెల్లింపే భవిష్యత్తులో రుణాలకు నమ్మకంగా మారుతుంది. క్రెడిట్ స్కోర్ పెరగడం ద్వారా ఇల్లు, వాహనం, వ్యాపార రుణాలు సులభంగా లభించే అవకాశం ఏర్పడనుంది. ప్రజల్లో ఆర్థిక క్రమశిక్షణ పెరిగి డిజిటల్ వ్యవస్థ మరింత బలపడుతుందని ఆర్థిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

శుక్రవారం
23 - 01 - 2026

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## బాలిక హక్కుల పరిరక్షణ సమానత్వానికి తొలి మెట్టు

జాతీయ బాలికా దినోత్సవం ఒక అధికారిక క్యాలెండర్ దినం మాత్రమే కాదు. ఇది సమాజం తన మనస్తత్వాన్ని అద్దంలో చూసుకునే సందర్భం. బాలిక పుట్టినప్పటి నుంచే వివక్ష మొదలయ్యే పరిస్థితులు ఇప్పటికీ పూర్తిగా తొలగిపోలేదు. చదువు, పోషణ, స్వేచ్ఛ, నిర్ణయాధికారం వంటి అంశాల్లో బాలిక వెనుకబాటుకు గురవుతూనే ఉంది. అభివృద్ధి గురించి ఎంత మాట్లాడుకున్నా, బాలికను సమానంగా చూడని సమాజం నిజమైన పురోగతిని సాధించలేదు. బాలిక హక్కులు అంటే దయతో ఇచ్చే సాయం కాదు, రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కులు అన్న అవగాహన ప్రతి ఇంట్లో, ప్రతి మనసులో బలంగా నాటుకోవాల్సిన అవసరం ఉంది.

విద్య బాలిక జీవితాన్ని మలిచే అత్యంత శక్తివంతమైన సాధనం. చదువుతోనే బాలిక తన భవిష్యత్తును తానే నిర్ణయించుకునే స్థాయికి చేరుతుంది. అయితే పేదరికం, సంప్రదాయ ఆంక్షలు, బాల్య వివాహాలు, కుటుంబ భాధ్యతల పేరుతో చదువుకు దూరమవుతున్న బాలికలు ఇంకా ఎందరో ఉన్నారు. ఒక బాలిక చదువు ఆగిపోతే, అది ఒక వ్యక్తి నష్టమే కాదు; సమాజానికి కలిగే నష్టం కూడా. చదువుకున్న బాలిక ఆరోగ్యంగా ఉంటుంది, తన కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది, పిల్లలకు మంచి విలువలు నేర్పుతుంది. అందుకే బాలిక విద్యపై పెట్టుబడి పెట్టడం అంటే సమాజ భవిష్యత్తును భద్రపరచడమే.

ఆరోగ్యం, భద్రత విషయాల్లో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు మరింత లోతైనవే. సరైన పోషకాహారం లేకపోవడం, వైద్య సేవలకు దూరంగా ఉండటం, మానసిక ఒత్తిళ్లు, వేధింపులు బాలిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. భద్రత లేని వాతావరణంలో బాలిక తన ప్రతిభను వెలికి తీయలేరు. ఇంటి నుంచి బడి వరకు, వీధి నుంచి కార్యాలయం వరకు ప్రతి చోటా బాలికకు భద్రత కల్పించాల్సిన బాధ్యత సమాజానిదే. చట్టాలు ఉన్నాయన్న తృప్తితో ఆగిపోకుండా, వాటి అమలులో నిజాయితీ ఉండాలి. బాలిక భద్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు, ప్రతి పౌరుడి నైతిక కర్తవ్యం.

బాలికల సాధికారత మాటల్లో కాదు, అవకాశాల్లో కనిపించాలి. వారికి నిర్ణయాల్లో భాగస్వామ్యం ఇవ్వాలి, నాయకత్వ అవకాశాలు కల్పించాలి. లింగ సమానత్వం అనేది ఒక వర్గానికి ఇచ్చే రాయితీ కాదు; సమాజాన్ని సమతుల్యంగా నిలబెట్టే మూలస్తంభం. బాలిక తన కలలను నిర్భయంగా కలగనగలిగిన రోజే, వాటిని సాధించగలిగిన రోజే నిజమైన అభివృద్ధి జరుగుతుంది. జాతీయ బాలికా దినోత్సవం మనకు ఇదే గుర్తు చేస్తోంది బాలిక బలపడితే కుటుంబం బలపడుతుంది, కుటుంబం బలపడితే సమాజం బలపడుతుంది, సమాజం బలపడితే దేశం ముందుకు సాగుతుంది. విద్య బాలికకు ఆయుధం. చదువు ఉంటేనే ఆత్మవిశ్వాసం వస్తుంది, నిర్ణయాలు తీసుకునే శక్తి పెరుగుతుంది. కానీ ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో బాలికల చదువు మధ్యలోనే ఆగిపోతోంది. ఆర్థిక ఇబ్బందులు, సామాజిక ఆంక్షలు, బాల్య వివాహాలు ఇందుకు ప్రధాన కారణాలు. ఒక బాలిక చదువుకుంటే ఒక కుటుంబం మాత్రమే కాదు, ఒక తరం మారుతుందన్న వాస్తవాన్ని మనం అంగీకరించాలి. బాలిక విద్యపై పెట్టుబడి పెట్టడం అంటే దేశ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టినట్టే. ఆరోగ్యం, భద్రత అంశాల్లోనూ బాలికలు వెనుకబడి ఉన్నారు. పోషకాహార లోపం, వైద్య సేవల అందుబాటు లేకపోవడం, మానసిక ఒత్తిళ్లు బాలికల జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయి. భద్రత లేని వాతావరణంలో బాలిక ఎదుగుదల సాధ్యం కాదు. ఇంట్లోనూ, పాఠశాలలోనూ, సమాజంలోనూ బాలిక భద్రతకు స్పష్టమైన చర్యలు అవసరం. చట్టాలు ఉన్నప్పటికీ అమలు లోపిస్తే ప్రయోజనం ఉండదు. భద్రత అనేది కేవలం పోలీస్ వ్యవస్థ బాధ్యత కాదు, సమాజం మొత్తం తీసుకోవాల్సిన బాధ్యత.

బాలికల సాధికారత అనేది మాటలకే పరిమితం కాకూడదు. వారికి అవకాశాలు ఇవ్వాలి, నిర్ణయాల్లో భాగస్వామ్యం కల్పించాలి. లింగ సమానత్వం సాధించాలంటే ఆడమగ తేడాలను తొలగించే ఆలోచనలతోనే మొదలుపెట్టాలి. ఒక బాలిక తన కలలను నెరవేర్చుకునే స్వేచ్ఛ పొందిన రోజే నిజమైన అభివృద్ధి జరుగుతుంది. జాతీయ బాలికా దినోత్సవం మనందరికీ ఇదే సందేశం ఇస్తోంది బాలికను గౌరవించిన సమాజమే నిజంగా ముందుకు సాగగలదు.

# పరాక్రమ దివస్..
# నేతాజీ సుభాష్ చంద్రబోస్ అణగని సంకల్పం

**– త్యాగంతో రగిలిన స్వాతంత్ర్య జ్వాల – దేశభక్తికి ధైర్యమే ఆయుధం**

డెస్క్, జనవరి 22 ,మన గళం:

భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో పరాక్రమం అనే పదానికి నిజమైన అర్థం ఇచ్చిన నాయకుడు సుభాష్ చంద్రబోస్. ఆయన జన్మదినాన్ని పరాక్రమ దివస్‌గా జరుపుకోవడం అనేది ఒక వ్యక్తిని స్మరించుకోవడం మాత్రమే కాదు, ఒక ఆలోచనా విధానాన్ని, ఒక విప్లవ దృక్పథాన్ని గుర్తు చేసుకోవడమే. స్వాతంత్ర్యం అనేది కోరుకుంటే లభించేది కాదు, దాన్ని సాధించాలంటే త్యాగం, ధైర్యం, సంకల్పం అవసరం అన్న సత్యాన్ని నేతాజీ తన జీవితంతో నిరూపించారు. ఆయన పేరు వినగానే భారతీయుల మనసుల్లో దేశభక్తి ఉవ్వెత్తున ఎగసిపడుతుంది.



నేతాజీ జీవితం చిన్ననాటి నుంచే అసాధారణమైనది. చదువులో ప్రతిభావంతుడిగా నిలిచిన ఆయన, దేశ సేవే తన లక్ష్యంగా ఎంచుకున్నారు. బ్రిటిష్ పాలనలో ఉన్నత ఉద్యోగ అవకాశాలు, భద్రతాయుతమైన జీవితం అన్నింటినీ వదిలిపెట్టి, స్వాతంత్ర్య ఉద్యమ మార్గాన్ని ఎంచుకోవడం చిన్న విషయం కాదు. ఇది ఆయనలోని త్యాగభావనకు నిదర్శనం. వ్యక్తిగత ప్రయోజనాల కంటే దేశ భవిష్యత్తే ముఖ్యమని ఆయన నమ్మారు. ఈ ఆలోచనలే ఆయనను ఇతర నేతల నుంచి భిన్నంగా నిలబెట్టాయి.

స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీ అహింసా మార్గాన్ని గౌరవించినప్పటికీ, అవసరమైతే సాయుధ పోరాటం కూడా తప్పనిసరే అన్న దృఢమైన అభిప్రాయంతో ముందుకు సాగారు. ఆజాద్ హింద్ సేన ఏర్పాటు ద్వారా భారతీయులలో నిద్రిస్తున్న ధైర్యాన్ని మేల్కొలిపారు. విదేశీ నేలపై నుంచే బ్రిటిష్ సామ్రాజ్యాన్ని సవాల్ చేయగలిగిన ఆత్మవిశ్వాసం ఆయనలో కనిపించింది. ఈ చర్యలతో భారత స్వాతంత్ర్య పోరాటానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది.

నేతాజీ ప్రసంగాలు యువతలో అగ్ని కణాల్లా పనిచేశాయి. దేశం కోసం ప్రాణాలను అర్పించడమే నిజమైన దేశభక్తి అన్న భావనను ఆయన లోతుగా నాటారు. "మీరు నాకు రక్తం ఇవ్వండి నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను" అనే పిలుపు ఒక నినాదం మాత్రమే కాదు, అది కోట్లాది భారతీయుల హృదయాలను కదిలించిన సంకల్ప ప్రకటన. ఈ పిలుపుతో అనేక మంది యువకులు స్వాతంత్ర్య పోరాటంలో చేరేందుకు ప్రేరణ పొందారు.

త్యాగం నేతాజీ జీవితానికి మూలస్తంభం. కుటుంబం, సుఖసౌకర్యాలు, వ్యక్తిగత ఆశయాలు అన్నింటినీ పక్కనబెట్టి దేశం కోసం జీవించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడుతూ ఎదురైన కష్టాలు, ప్రమాదాలు ఆయనను వెనక్కి నెట్టలేకపోయాయి. ప్రతి అడ్డంకిని ఎదుర్కొంటూ ముందుకు సాగడమే ఆయన పరాక్రమానికి నిజమైన నిర్వచనం. ఆయన జీవితం భారతీయులకు అణగని మనోధైర్యానికి ఉదాహరణగా నిలిచింది.

నేతాజీ నాయకత్వంలో దేశభక్తి అనేది కేవలం భావోద్వేగం కాదు, ఒక క్రమశిక్షణతో కూడిన కార్యాచరణగా మారింది. స్వేచ్ఛ కోసం పోరాడే ప్రతి వ్యక్తికి కర్తవ్యబద్ధత, త్యాగం, క్రమశిక్షణ అవసరమని ఆయన నమ్మారు. ఈ విలువలే ఆజాద్ హింద్ సేనకు బలంగా నిలిచాయి. దేశం కోసం పోరాడే సైనికులలో ఆయన నింపిన ఆత్మవిశ్వాసం చరిత్రలో ఎప్పటికీ మరిచిపోలేనిది.

పరాక్రమ దివస్ సందర్భంగా నేతాజీ జీవితం మనకు ఒక ముఖ్యమైన ప్రశ్న వేస్తోంది. స్వాతంత్ర్యం సాధించిన తరువాత మనం ఆ పరాక్రమాన్ని ఎంతవరకు కొనసాగిస్తున్నాం? దేశాభివృద్ధి కోసం, సామాజిక న్యాయం కోసం, ప్రజా హితం కోసం అదే ధైర్యంతో నిలబడుతున్నామా అనే ఆలోచన ప్రతి పౌరుడిలో రావాలి. పరాక్రమం అనేది యుద్ధభూమికే పరిమితం కాదు, రోజువారీ జీవితంలో బాధ్యతగా మారాల్సిన విలువ.

నేటి తరానికి నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఒక సజీవ స్ఫూర్తి. ఆయన జీవితం దేశభక్తి అంటే మాటల్లో కాదు, కార్యాల్లో చూపించాలనే బోధను ఇస్తోంది. త్యాగం, ధైర్యం, సంకల్పం కలిసినప్పుడే ఒక దేశం ముందుకు సాగగలదన్న సత్యాన్ని ఆయన మనకు అందించారు. పరాక్రమ దివస్ అనేది కేవలం ఒక జయంతి కాదు, భారతదేశం ఎప్పటికీ అణగకుండా నిలబడాలన్న సంకల్పాన్ని పునరుద్ఘాటించే రోజు.

త్యాగం, ధైర్యం, సంకల్పం నేతాజీ జీవితానికి మూడుస్థంభాలు. ఆయన ప్రసంగాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. "మీరు నాకు రక్తం ఇవ్వండి నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను" అనే పిలుపు ఒక నినాదం కాదు, అది ఒక ఉద్యమానికి ప్రాణం. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అనేకమందికి నేతాజీ మార్గదర్శకుడిగా నిలిచారు. వ్యక్తిగత సుఖసంతోషాలను త్యాగం చేసి దేశం కోసం జీవించడం ఎలా ఉంటుందో ఆయన చూపించారు.

పరాక్రమ దివస్ సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది. దేశం కోసం ఆలోచించడం, దేశం కోసం నిలబడటం ప్రతి పౌరుడి బాధ్యత. స్వాతంత్ర్యం సాధించిన తరువాత కూడా దేశాభివృద్ధి కోసం అదే పరాక్రమం అవసరం. నిజమైన దేశభక్తి అనేది మాటల్లో కాదు, బాధ్యతల్లో కనిపించాలి. నేతాజీ చూపిన మార్గం ఈ తరానికి మాత్రమే కాదు, రాబోయే తరాలకు కూడా స్ఫూర్తిదాయకం. ఆయన జీవితం భారతదేశానికి ఎప్పటికీ అణగని ధైర్యానికి ప్రతీకగా నిలుస్తూనే ఉంటుంది.



# ఉదయం నడకతో ఆరోగ్య జీవనానికి బలమైన పునాది

మన గళం: నేటి బిజీ జీవనశైలిలో శారీరక కదలికలు తగ్గిపోతుండటంతో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రోజూ ఉదయం నడక చేయడం ఆరోగ్యాన్ని కాపాడుకునే అత్యంత సులభమైన మార్గమని వారు సూచిస్తున్నారు. కనీసం 20 నుంచి 30 నిమిషాలు నడక చేయడం వల్ల గుండె పనితీరు మెరుగుపడి రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుందని చెబుతున్నారు. దీని వల్ల అధిక రక్తపోటు, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులను నియంత్రించవచ్చని తెలిపారు. నడక సమయంలో శరీరానికి తగినంత ఆక్సిజన్ అందడంతో అలసట తగ్గి చురుకుదనం పెరుగుతుందని వివరించారు. మానసిక ఒత్తిడి తగ్గడంలో కూడా ఉదయం నడక కీలక పాత్ర పోషిస్తుందని నిపుణుల అభిప్రాయం. రోజంతా ఉత్సాహంగా పనిచేయడానికి ఇది సహాయపడుతుందని చెబుతున్నారు. ప్రత్యేకించి పట్టణ ప్రాంతాల్లో నివసించే వారు తప్పనిసరిగా ఈ అలవాటు అలవరచుకోవాలని సూచించారు.



ఖరీదైన చికిత్సలకంటే, రోజువారీ నడకే దీర్ఘకాలిక ఆరోగ్యానికి భరోసా ఇస్తుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

# సరైన నిద్ర లేకపోతే ఆరోగ్యం ప్రమాదంలో

మన గళం: ఆధునిక జీవనశైలిలో నిద్రకు ప్రాధాన్యం తగ్గిపోతుండటంతో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రోజూ సరైన సమయానికి, తగినంత నిద్రపోవడం ఆరోగ్యానికి తప్పనిసరి అని వారు సూచిస్తున్నారు.కనీసం 7 నుంచి 8 గంటల నిద్ర వల్ల శరీరం తిరిగి శక్తిని పొందుతుందని తెలిపారు.నిద్రలేమి వల్ల మధుమేహం, అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు.సరైన నిద్ర లేకపోతే ఏకాగ్రత తగ్గి, పనితీరు మందగిస్తుందని చెప్పారు.మానసిక ఒత్తిడి, చిరాకు, అలసట వంటి సమస్యలకు నిద్రలేమి ప్రధాన కారణమని వివరించారు.పిల్లలు, యువత, ఉద్యోగులు అందరూ నిద్రపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచిస్తున్నారు.మొబైల్ ఫోన్, టెలివిజన్ వినియోగాన్ని నిద్రకు



ముందు తగ్గించుకోవడం మంచిదని తెలిపారు.క్రమబద్ధమైన నిద్ర అలవాటు ఆరోగ్యకరమైన జీవనానికి బలమైన పునాదిగా నిలుస్తుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

# సమతుల ఆహారమే సంపూర్ణ ఆరోగ్యానికి మార్గం

మన గళం: ప్రస్తుత కాలంలో ఆహారపు అలవాట్లు మారిపోవడంతో అనేక జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఆరోగ్యంగా ఉండాలంటే రోజువారీ ఆహారంలో సమతుల్యత తప్పనిసరిగా ఉండాలని వారు సూచిస్తున్నారు.ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు ఆహారంలో భాగంగా ఉండటం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయని తెలిపారు.అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు కలిగిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల ఊబకాయం, మధుమేహం వంటి సమస్యలు వస్తాయని హెచ్చరించారు.సమతుల ఆహారం జీర్ణక్రియను మెరుగుపరచి శరీర బలాన్ని పెంచుతుందని వివరించారు.పిల్లల ఎదుగుదలకూ, వృద్ధుల ఆరోగ్యానికీ సరైన ఆహారం కీలకమని నిపుణుల అభిప్రాయం.ఫాస్ట్ ఫుడ్‌కు బదులుగా ఇంటి ఆహారాన్ని ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు.సమయానికి భోజనం చేయడం కూడా ఆరోగ్యానికి ముఖ్యమని తెలిపారు.ఆహారంలో



నియమాలు పాటిస్తే మందులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

# తగినంత నీరు తాగితే ఆరోగ్యం చేతిలోనే



మన గళం: శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో నీటి పాత్ర అత్యంత కీలకమని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.రోజువారీ జీవితంలో చాలామంది తగినంత నీరు తాగకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.రోజుకు కనీసం 8 నుంచి 10 గ్లాసుల నీరు తాగడం ద్వారా శరీరంలోని విషపదార్థాలు బయటకు వెళ్లిపోతాయని చెప్పారు.నీటి వినియోగం పెరిగితే జీర్ణక్రియ మెరుగుపడి మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయని వివరించారు.కిడ్నీ, కాలేయం సక్రమంగా పనిచేయడానికి నీరు ఎంతో అవసరమని వైద్యులు సూచిస్తున్నారు.నీరు తక్కువగా తీసుకోవడం వల్ల అలసట, తలనొప్పి, చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు.ప్రత్యేకించి వేసవి కాలంలో నీటి అవసరం మరింత పెరుగుతుందని తెలిపారు.పిల్లలు, వృద్ధులు నీరు తాగడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచనలు చేస్తున్నారు.రోజువారీ అలవాట్లలో నీరు తాగడాన్ని భాగంగా మార్చుకుంటే అనారోగ్యాలకు దూరంగా ఉండవచ్చని నిపుణుల అభిప్రాయం.

# సహజ చర్మ సంరక్షణతో మెరిసే అందం



మన గళం: నేటి కాలంలో కాలుష్యం, ఒత్తిడి, ఆహారపు అలవాట్ల కారణంగా చర్మ సమస్యలు పెరుగుతున్నాయని చర్మ వైద్యులు చెబుతున్నారు.ఖరీదైన క్రీములు కాకుండా సహజ చర్మ సంరక్షణ పద్ధతులు పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచిస్తున్నారు.రోజుకు కనీసం రెండుసార్లు ముఖాన్ని శుభ్రంగా కడగడం వల్ల మురికి, నూనె తొలగిపోతుందని తెలిపారు.తగినంత నీరు తాగడం వల్ల చర్మం లోపలినుంచి తేమను పొందుతుందని చెప్పారు.పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకుంటే చర్మ కాంతి పెరుగుతుందని వివరించారు.ఎండలో బయటికి వెళ్లేటప్పుడు ముఖాన్ని రక్షించుకోవడం అవసరమని హెచ్చరించారు.నిద్రలేమి వల్ల ముఖంపై నల్లటి వలయాలు వస్తాయని వైద్యుల అభిప్రాయం.రోజువారీ అలవాట్లలో చర్మ సంరక్షణను భాగంగా మార్చుకుంటే సహజ అందం నిలుస్తుందని నిపుణులు చెబుతున్నారు.

# జుట్టు సంరక్షణలో నిర్లక్ష్యం వద్దు



మన గళం: జుట్టు ఆరోగ్యం మొత్తం శరీర ఆరోగ్యంతో ముడిపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.అనవసర రసాయనాలు కలిగిన ఉత్పత్తులు వాడటం వల్ల జుట్టు రాలిపోవడం పెరుగుతోందని హెచ్చరిస్తున్నారు.వారానికి కనీసం రెండు సార్లు తలస్నానం చేయడం జుట్టు శుభ్రంగా ఉంచుతుందని తెలిపారు.సహజ నూనెలతో తల మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడి జుట్టు బలంగా పెరుగుతుందని చెప్పారు.ఒత్తిడి, నిద్రలేమి కూడా జుట్టు సమస్యలకు కారణమవుతాయని వివరించారు.పోషకాహారం తీసుకుంటే జుట్టు కాంతివంతంగా మారుతుందని నిపుణుల అభిప్రాయం.వేడి పరికరాల వాడకం తగ్గించుకోవాలని సూచిస్తున్నారు.సరైన సంరక్షణతో జుట్టు రాలే సమస్యను చాలా వరకు నియంత్రించవచ్చని చెబుతున్నారు.

# సూపర్‌స్టార్స్‌తో ఛాన్సులు..



హైదరాబాద్ 21 జనవరి 2026 : మన గళం,: తన కెరీర్‌లో వరుసగా ఇద్దరు అగ్ర నటులతో కలిసి నటించే అవకాశాలు రావడంతో హీరోయిన్ నిధి అగర్వాల్ మంచి ఉత్సాహంలో ఉంది. గత ఏడాది పవన్ కళ్యాణ్ సరసన హరిహర వీరమల్లు చిత్రంలో నటించిన నిధి, ఈ సంక్రాంతికి ప్రభాస్‌తో కలిసి రాజా సాబ్ సినిమాలో కనిపించింది. ఈ రెండు సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా తన కెరీర్‌పై మాత్రం ఎలాంటి ప్రభావం లేదని నిధి స్పష్టంగా చెప్పింది. పవన్ కళ్యాణ్ చిత్రంలో అవకాశం రావడం తన జీవితంలో కీలక మలుపుగా మారిందని పేర్కొంది.

రాజకీయ బిజీ షెడ్యూల్ కారణంగా హరిహర వీరమల్లు షూటింగ్ ఆలస్యం అయినప్పటికీ పవన్ కళ్యాణ్ ఎంతో కష్టపడి సినిమా పూర్తి చేశారని నిధి వెల్లడించింది. ప్రచార కార్యక్రమాల బాధ్యతను తానే ఎక్కువగా నిర్వహించానని తెలిపింది. ఆ క్రమంలో పవన్ కళ్యాణ్ నుంచి ప్రశంసలు కూడా అందాయని చెప్పింది. అనంతరం ప్రభాస్‌తో చేసిన సినిమా పెద్ద విజయం సాధించకపోయినా తన నటనకు మంచి గుర్తింపు వచ్చిందని వివరించింది.

ప్రచార కార్యక్రమాల సమయంలో ఒక మాల్‌లో జరిగిన ఘటన తనను కలచివేసిందని నిధి తెలిపింది. అభిమానులు చుట్టుముట్టి అసభ్యంగా ప్రవర్తించడంతో భద్రతా సిబ్బంది సహాయంతో బయటకు వచ్చినట్లు చెప్పింది. ఈ ఘటన తీవ్ర వివాదంగా మారిందని గుర్తు చేసింది.

ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న నిధి సినీ పరిశ్రమలో జరుగుతున్న నెగటివ్ ప్రచారాలపై స్పందించింది. కొందరు కావాలని పెద్ద మొత్తంలో ఖర్చు చేసి ఇతరులపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించింది. నటీనటులు చాలా భావోద్వేగంగా ఉంటారని, ఇలాంటి ప్రచారాలు వారి కుటుంబాలను కూడా బాధపెడతాయని చెప్పింది. తాము సమాధానం చెప్పాల్సింది తల్లిదండ్రులకు మాత్రమేనని స్పష్టం చేసింది. తనపై కూడా ఒకటి రెండు సార్లు ఇలాంటి ప్రచారాలు జరిగాయని, కానీ ధైర్యంగా ఎదుర్కొన్నానని తెలిపింది. కాశీకి వెళ్లి వచ్చిన తర్వాత ఆధ్యాత్మికంగా బలంగా మారానని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనే శక్తి వచ్చిందని నిధి వెల్లడించింది.

# కార్తీక్ పాత్రకు కొత్త ముఖం..





హైదరాబాద్ జనవరి 22 ,మన గళం,: వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ నటుడు శ్రీనాథ్ మాగంటి ఇప్పుడు టాలీవుడ్‌లో ఓ భారీ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నాడన్న వార్త ఆసక్తికరంగా మారింది. 'హిట్' ఫ్రాంచైజీలో అభిలాష్‌గా, 'లక్కీ భాస్కర్'లో సూరజ్‌గా మెప్పించిన ఆయన, సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించిన 'యానిమల్' సినిమాతో బాలీవుడ్‌లోనూ గుర్తింపు సంపాదించాడు.

తాజా సమాచారం ప్రకారం, తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో రూపొందిన కల్ట్ క్లాసిక్ మూవీ 'ఈ నగరానికి ఏమైంది' సీక్వెల్‌లో శ్రీనాథ్ మాగంటి కీలక పాత్రలో నటించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే సీక్వెల్ స్క్రిప్ట్ పనులు పూర్తయ్యాయని, మొదటి భాగంలాగే ఇది కూడా స్నేహబంధం, నిజ జీవిత ఘటనల ఆధారంగా సాగుతుందని తెలుస్తోంది. ముఖ్యంగా మొదటి భాగంలో కార్తీక్ పాత్రలో నటించిన సుశాంత్ ఈ సీక్వెల్‌లో ఉండబోరని దర్శకుడు తరుణ్ భాస్కర్ ఇప్పటికే స్పష్టం చేశారు. అయినప్పటికీ కార్తీక్ పాత్ర కథలో కొనసాగుతుందని ఆయన చెప్పడంతో, ఇప్పుడు ఆ పాత్రకు శ్రీనాథ్ మాగంటి ఎంపిక అయ్యాడా అనే చర్చ జోరుగా సాగుతోంది. ఈ విషయంపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి.

కల్ట్ సినిమాకు సీక్వెల్, పైగా కార్తీక్ పాత్రకు కొత్త నటుడు రావడం టాలీవుడ్‌లో క్యూరియాసిటీని పెంచుతోంది. శ్రీనాథ్ మాగంటి ఈ అవకాశాన్ని ఎలా వినియోగించుకుంటాడో చూడాలని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'మొగుడు' అంటూ విశాల్ మాస్ ఎంట్రీ..
## టైటిల్ ప్రోమోతో ఫుల్ హంగామా..!!




చెన్నై జనవరి 22 ,మన గళం,: , తమిళ స్టార్ హీరో విశాల్ తన కెరీర్‌లో 36వ చిత్రంతో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. హిట్ దర్శకుడు సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా, వీరిద్దరి కాంబినేషన్‌లో నాలుగో ప్రాజెక్ట్‌గా రూపొందుతోంది. తాజాగా ఈ చిత్రానికి తెలుగులో "మొగుడు" అనే ఆకట్టుకునే టైటిల్‌ను ఖరారు చేస్తూ, టైటిల్ ప్రోమోను విడుదల చేశారు. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన మగ మహారాజు, మదగజరాజా, యాక్షన్ చిత్రాలు మంచి ఆదరణ పొందిన సంగతి తెలిసిందే. అదే తరహాలో ఈ సినిమా కూడా ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ఉండనుందని ప్రోమో చూస్తేనే అర్థమవుతోంది. ప్రోమోలో కామెడీ, యాక్షన్ మేళవింపు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. "మొగుడులా ఉండటం ముఖ్యం కాదు.. మొగుడు మొగుడులా ఉండటమే ముఖ్యం" అంటూ యోగిబాబు చెప్పే డైలాగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఈ చిత్రంలో తమన్నా భాటియా హీరోయిన్‌గా నటిస్తుండగా, యోగిబాబు కీలక పాత్రలో నవ్వులు పంచనున్నాడు. కథలో విశాల్ ఇంట్లో అమాయకపు భర్తగా కనిపిస్తూనే, బయట మాత్రం విలన్లకు దడ పుట్టించే మాస్ క్యారెక్టర్‌లో మెప్పించబోతున్నాడు.హిప్ హాప్ తమిళ సంగీతం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుండగా, ఈ భారీ ప్రాజెక్ట్‌ను ఏసీఎస్ అరుణ్ కుమార్ నిర్మిస్తున్నారు. టైటిల్ ప్రోమోతోనే మంచి బజ్ క్రియేట్ చేసిన 'మొగుడు'పై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి.

# దర్శకుడి నుంచి హీరోగా దూకుడు..
## కొత్త ప్రేమకథతో అభిషన్ మెరుపులు..!!




హైదరాబాద్ జనవరి 22 ,మన గళం: పర్యాటక కుటుంబం చిత్రంతో ఒక్కసారిగా సినీ వర్గాల దృష్టిని ఆకర్షించిన దర్శకుడు అభిషన్ జీవింత్ ఇప్పుడు హీరోగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం ప్రేమ నేపథ్యంతో రూపొందుతోంది. ఈ చిత్రానికి మదన్ దర్శకత్వం వహించగా, మలయాళీ నటి అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తోంది. ప్రముఖ నిర్మాత సౌందర్య రజనీకాంత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదలైన ప్రచార దృశ్యాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రేమ, భావోద్వేగాలు, యువతను ఆకట్టుకునే కథనం ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనున్నట్లు తెలుస్తోంది. అభిషన్ జీవింత్ నటనలో కొత్త కోణం కనిపించనుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ చిత్రానికి సీన్ రోల్డాన్ సంగీతం అందిస్తుండగా, శ్రేయాస్ కృష్ణ ఛాయాగ్రహణం నిర్వహిస్తున్నారు. కావ్య అనిల్, సచిన్ నాచిప్పన్, తేని మురుగన్, శరవణన్ ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న అభిషన్ ఇప్పుడు హీరోగా కూడా ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటాడా అనే ఉత్కంఠ సినీ వర్గాల్లో నెలకొంది.

# ప్రభాస్ స్పీడ్‌కు బ్రేకుల్లేవు..

హైదరాబాద్ జనవరి 22 ,మన గళం: పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం కెరీర్‌లో అత్యంత వేగంగా దూసుకెళ్తున్న దశలో ఉన్నారు. ఒకదానికొకటి మించిన భారీ ప్రాజెక్టులతో బిజీగా కొనసాగుతున్న ఆయన, సంక్రాంతి కానుకగా విడుదలైన తాజా చిత్రంతో మళ్లీ థియేటర్లలో సందడి చేశారు. ఈ సినిమాకు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద ప్రభాస్ క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. కథ, జానర్ ఎలా ఉన్నా ప్రభాస్ పేరు ఉంటే ఓపెనింగ్స్ ఖాయం అనే విషయం మరోసారి రుజువైంది. ఇదే ఊపుతో ఆయన రాబోయే చిత్రాలు మరింత భారీ రికార్డులు సృష్టిస్తాయన్న అంచనాలు బలపడుతున్నాయి.

ఈ నేపథ్యంలో అభిమానుల దృష్టి మొత్తం సలార్ రెండో భాగంపైనే నిలిచింది. మొదటి భాగం భారీ ఓపెనింగ్స్‌తో పాటు దేశవ్యాప్తంగా అద్భుతమైన వసూళ్లు సాధించి ప్రభాస్ మాస్ ఇమేజ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. దేవ పాత్రలో ఆయన చూపించిన ఇంటెన్సిటీ, యాక్షన్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. దీంతో కథకు కొనసాగింపుగా రాబోతున్న రెండో భాగంపై అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. తాజాగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 25న ఏదైనా ప్రత్యేక అప్‌డేట్ లేదా చిన్న గ్లింప్స్ విడుదలయ్యే అవకాశం ఉందన్న ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. అధికారిక ప్రకటన ఇంకా రాకపోయినా ఈ వార్తలు అభిమానుల్లో ఉత్కంఠను పెంచుతున్నాయి.

మరోవైపు చిత్ర బృందం ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండటంతో టీజర్ విడుదలపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ ఆ రోజున చిన్న అప్‌డేట్ వచ్చినా సరే అది నెట్టింట పెద్ద ఎత్తున ట్రెండ్ అవుతుందని అభిమానులు భావిస్తున్నారు. కథ పరంగా రెండో భాగంలో ఖాన్సార్ సింహాసనం కోసం జరిగే రక్తపాత పోరాటమే ప్రధాన ఆకర్షణగా ఉండనుందని సమాచారం. మొదటి భాగంలో స్నేహబంధంతో కనిపించిన దేవ మరియు వరదరాజ మన్నార్ పాత్రలు రెండో భాగంలో శత్రుత్వంగా ఎలా మారతాయన్నది కీలకంగా మారనుంది. దేవ శౌర్యాంగ వంశానికి చెందినవాడన్న మలుపుతో ముగిసిన కథ, రెండో భాగంలో భారీ యాక్షన్ ఘట్టాలకు దారి తీస్తుందని టాక్ వినిపిస్తోంది. దర్శకుడు ఈ సీక్వెల్‌ను మొదటి భాగాన్ని మించే స్థాయిలో మరింత గ్రాండ్‌గా తెరకెక్కించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. ఈ చిత్రం షూటింగ్ 2026 మధ్యలో ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.



# రోహిత్ శర్మకు డాక్టరేట్..




పుణె 22 జనవరి 2026 ,మన గళం,: భారత క్రికెట్ స్టార్ రోహిత్ శర్మకు క్రీడా రంగంలో చేసిన విశేష సేవలకు గాను డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. అజింక్య డీవై పాటిల్ విశ్వవిద్యాలయం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. పుణెలో శనివారం జరగనున్న విశ్వవిద్యాలయం 10వ స్నాతకోత్సవ వేడుకలో రోహిత్ శర్మకు ఈ గౌరవం అందజేయనున్నారు. కెప్టెన్‌గా, స్టార్ ఆటగాడిగా భారత జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన రోహిత్ శర్మకు ఇది మరో ప్రతిష్టాత్మక గుర్తింపుగా నిలవనుంది. టీ20 ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ వంటి ముఖ్యమైన టోర్నీల్లో భారత జట్టును విజయపథంలో నడిపించిన నాయకత్వం, స్థిరమైన ప్రదర్శనలే ఈ గౌరవానికి కారణమని విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి. డాక్టరేట్ అందుకోవడం ద్వారా రోహిత్ శర్మ క్రీడా రంగంలో యువతకు మరింత ప్రేరణగా నిలవనున్నారని క్రీడాభిమానులు అభిప్రాయపడుతున్నారు. తన క్రమశిక్షణ, పట్టుదల, ఆటపై అంకితభావంతో ఎంతోమందికి ఆదర్శంగా మారిన రోహిత్ శర్మకు లభించిన ఈ గౌరవం భారత క్రీడా చరిత్రలో మరో మైలురాయిగా భావిస్తున్నారు.

# సూర్య ఫామ్ కుదరకపోతే టీమ్‌కే ప్రమాదం..



న్యూఢిల్లీ 22 జనవరి 2026 ,మన గళం,: టీ20 ప్రపంచకప్ సమీపిస్తున్న నేపథ్యంలో భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్‌పై రోహిత్ శర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. కెప్టెన్ ఫామ్‌లో ఉన్నాడా లేదా అన్నదే అసలు సమస్య కాదని, కానీ జట్టుకు ప్రధానమైన బ్యాటింగ్ శక్తి తడబాటుకు గురైతే పరిస్థితి కఠినంగా మారుతుందని రోహిత్ స్పష్టం చేశారు. ఒక ఆటగాడు ఫామ్‌లో లేకపోయినా జట్టులో ప్రత్యామ్నాయాలు ఉంటాయని, కానీ కీలక బ్యాటర్ పరుగులు చేయకపోతే మొత్తం బ్యాటింగ్ లైనప్‌పై ప్రభావం పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. భారత జట్టు బలమంతా బ్యాటింగ్‌పైనే ఆధారపడి ఉందని రోహిత్ పేర్కొన్నారు. అందులో ఒక ప్రధాన స్థంభం విఫలమైతే జట్టు ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేదని చెప్పారు. సూర్య బాగా బ్యాటింగ్ చేయకపోతే బ్యాటింగ్ క్రమం ఒత్తిడిలో పడుతుందని, దాంతో ప్రణాళికలు కూడా సరిగ్గా అమలవ్వవని వివరించారు. అయితే కెప్టెన్సీ విషయంలో మాత్రం సూర్యపై పూర్తి నమ్మకం ఉందని రోహిత్ వెల్లడించారు. ఆటపై సూర్యకు ఉన్న అవగాహన, జట్టులోని ఆటగాళ్ల సామర్థ్యాన్ని అర్థం చేసుకునే తీరు అతడిని మంచి నాయకుడిగా నిలబెడుతుందని రోహిత్ తెలిపారు. ఆటగాళ్ల నుంచి ఉత్తమ ప్రదర్శన ఎలా రాబట్టాలో సూర్యకు బాగా తెలుసని చెప్పారు. కేవలం బ్యాటింగ్‌లో ఫామ్‌ను తిరిగి అందుకుంటే చాలు, జట్టును విజయాల బాటలో నడిపించడంలో సూర్యకు ఎలాంటి ఇబ్బంది ఉండదని రోహిత్ శర్మ స్పష్టం చేశారు.

# కోచ్ అధికారాలపై నిజాలు త్వరలోనే బయటపడతాయా..!



న్యూఢిల్లీ 22 జనవరి 2026 ,మన గళం,: న్యూజిలాండ్‌తో తొలి టీ20 మ్యాచ్ ప్రారంభానికి ముందు భారత జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కలిసిన విషయం రాజకీయంగా, క్రీడారంగంలో ఆసక్తి రేపింది. ఈ భేటీ అనంతరం శశి థరూర్ సామాజిక మాధ్యమ వేదికలో ఓ పోస్టు పెట్టారు. ప్రధాని తర్వాత దేశంలో అత్యంత కఠినమైన బాధ్యత గంభీర్‌దేనని ఆయన ప్రశంసించారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన గంభీర్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు.

దుమారం తగ్గిన తర్వాత కోచ్‌కు ఉందని చెప్పుకుంటున్న అపరిమిత అధికారాల వెనుక ఉన్న నిజానిజాలు స్పష్టమవుతాయని గంభీర్ పేర్కొన్నారు. అప్పటివరకు తన సొంత జట్టు సభ్యులతోనే పోటీపడుతున్న పరిస్థితి తనకు వినోదంగా అనిపిస్తోందని తెలిపారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను భారత్ కోల్పోవడంతో గంభీర్ తీసుకుంటున్న నిర్ణయాలపై విమర్శలు వెల్లువెత్తాయి. జట్టు ఎంపికలు, వ్యూహాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అయితే ఈ విమర్శలకు గంభీర్ పరోక్షంగా సమాధానం ఇచ్చినట్టుగా ఆయన వ్యాఖ్యలను అభిమానులు భావిస్తున్నారు.

ఇదిలా ఉండగా ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. నాగ్‌పూర్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 48 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌లో 1కు 0 ఆధిక్యంలో నిలిచింది. ఈ విజయంతో జట్టులో ఉత్సాహం పెరిగినా, కోచ్ అధికారాల అంశంపై చర్చ మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది.

# సొంత గడ్డపై భారత్ పతనం..
# రికీ పాంటింగ్ ఘాటు విమర్శలు..



ముంబై 22 జనవరి 2026 ,మన గళం,: భారత్ న్యూజిలాండ్ మధ్య ఇటీవల జరిగిన వన్డే సిరీస్‌లో టీమిండియా సొంత గడ్డపై 2 కు 1 తేడాతో ఓటమి పాలవడం దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారి తీసింది. ఈ పరాజయంపై అభిమానులతో పాటు మాజీ ఆటగాళ్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ రికీ పాంటింగ్ భారత జట్టు ప్రదర్శనపై ఘాటు వ్యాఖ్యలు చేశారు.

భారత్ ఓటమికి ప్రధాన కారణం చెత్త ప్రదర్శనేనని పాంటింగ్ స్పష్టం చేశారు. ఆటగాళ్ల ఎంపికలో స్పష్టత లేకపోవడం, జట్టు ప్రణాళికలు సరిగా అమలు కాకపోవడం వల్లే ఈ ఫలితం వచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్రదర్శన ఆధారంగా మాత్రమే కోచ్ నియామకాలు చేయడం సరైంది కాదని సూచించారు. జట్టును ముందుకు నడిపించాలంటే దీర్ఘకాలిక ఆలోచన, క్రమశిక్షణ అవసరమని తెలిపారు.

కోచ్‌గా గౌతమ్ గంభీర్‌కు బాధ్యతలు అప్పగించిన విధానంపైనా పాంటింగ్ సందేహాలు వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించాలంటే కేవలం పేరుకే కాదు అనుభవం, వ్యూహాత్మక ఆలోచన ఉండాలని అన్నారు. ఆటగాళ్ల ఎంపికలో భారత క్రికెట్ నియంత్రణ మండలి మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

సొంత మైదానంలో సిరీస్ కోల్పోవడం జట్టుకు హెచ్చరికగా తీసుకోవాలని పాంటింగ్ అభిప్రాయపడ్డారు. రాబోయే అంతర్జాతీయ టోర్నీల్లో మెరుగైన ప్రదర్శన చేయాలంటే ఇప్పటి నుంచే లోపాలను సరిదిద్దుకోవాలని ఆయన సూచించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

# ఐసీసీ షాక్ నిర్ణయం.. బీసీబీ అధ్యక్షుడి ఆశలు ఏమయ్యాయో..!



ముంబై 22 జనవరి 2026 ,మన గళం,: ఖ టీ20 ప్రపంచకప్ 2026లో తమ మ్యాచ్‌లను భారత్ నుంచి శ్రీలంకకు తరలించాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కోరిన అభ్యర్థనను అంతర్జాతీయ క్రికెట్ మండలి తిరస్కరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీసీబీ అధ్యక్షుడు అమినుల్ ఇస్లాం తాజాగా స్పందించారు. ఏదైనా అద్భుతం జరిగి ఐసీసీ తమకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటుందన్న ఆశ ఇంకా వదులుకోలేదని ఆయన తెలిపారు. బంగ్లాదేశ్ ప్రభుత్వంతో చర్చించేందుకు కొంత గడువు ఇవ్వాలని, 24 నుంచి 48 గంటల్లో తమ తుది నిర్ణయం వెల్లడిస్తామని ఐసీసీని కోరినట్లు చెప్పారు.

భారత్ బంగ్లాదేశ్ మధ్య ప్రస్తుతం దౌత్యపరమైన ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయని, ఆటగాళ్ల భద్రతే తమకు ప్రధాన ఆందోళన అని అమినుల్ ఇస్లాం స్పష్టం చేశారు. భారత్‌లో మ్యాచ్‌లు ఆడటం సురక్షితం కాదని, శ్రీలంకలో ఆడేందుకే తాము కట్టుబడి ఉన్నామని ఆయన వ్యాఖ్యానించారు. ఐసీసీ నిర్ణయాన్ని తాము తెలుసుకున్నప్పటికీ, చివరి అవకాశం కోసం ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. ప్రపంచకప్‌లో ఆడాలన్నది ప్రతి జట్టుకు ఉండే కోరికేనని, బంగ్లాదేశ్ ఆటగాళ్లు కూడా అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనాలని ఉత్సాహంగా ఉన్నారని ఆయన చెప్పారు. అయితే ఒకవైపు టోర్నీలో ఆడాలని కోరుకుంటూనే మరోవైపు భారత్‌పై వ్యాఖ్యలు చేయడం సరైందా అనే చర్చ సోషల్ మీడియాలో మొదలైంది. ఇదిలా ఉండగా ఐసీసీ అత్యవసర సమావేశంలో బీసీబీ తన పంతం వీడకపోతే బంగ్లాదేశ్ జట్టును ప్రపంచకప్ నుంచి తప్పించే అవకాశం ఉందని హెచ్చరించింది. వారి స్థానంలో ర్యాంకింగ్స్‌లో తర్వాతి స్థానంలో ఉన్న స్కాట్లాండ్ జట్టును అవకాశం ఇవ్వాలన్న నిర్ణయాన్ని కూడా తీసుకుంది. ఈ పరిణామం బంగ్లాదేశ్ క్రికెట్ వర్గాల్లో కలకలం రేపుతోంది. అభిమానుల్లో ఆందోళన పెరుగుతుండగా, చివరకు బీసీబీ ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తిగా మారింది.

# చరిత్రే తలవంచింది.. 500 విజయాలతో పీవీ సింధు సరికొత్త రికార్డు!!

హైదరాబాద్ 22 జనవరి 2026,మన గళం,: భారత బ్యాడ్మింటన్ స్టార్ పూసర్ల వెంకట సింధు మరో అద్భుత ఘనతను తన ఖాతాలో వేసుకుంది. కెరీర్‌లో 500 మ్యాచ్‌ల్లో విజయం సాధించి, ఈ ఘనత అందుకున్న తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించింది. అంతేకాదు ప్రపంచ స్థాయిలో ఈ మైలురాయిని చేరుకున్న ఆరో మహిళా షట్లర్‌గా నిలిచింది. తాజాగా జరిగిన ఇండోనేషియా మాస్టర్స్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో డెన్మార్క్‌కు చెందిన ప్రత్యర్థిని 21-19, 21-18 తేడాతో ఓడించి ఈ అరుదైన రికార్డును అందుకుంది. సుమారు 43 నిమిషాల పాటు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో సింధు అద్భుత ఆటతీరుతో అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. ఈ విజయంతో క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. క్వార్టర్ ఫైనల్‌లో చైనాకు చెందిన ప్రపంచ నాలుగో ర్యాంకు షట్లర్‌తో సింధు తలపడనుంది. ఇప్పటివరకు వీరిద్దరి మధ్య 13 సార్లు పోటీ జరగగా, ప్రత్యర్థి 7 సార్లు, సింధు 6 సార్లు విజయం సాధించింది. చివరిసారిగా 2019లో సింధు ఆమెను ఓడించింది. ఇప్పుడు మరోసారి గెలిచి తన రికార్డును మరింత బలపర్చాలని సింధు పట్టుదలగా ఉంది. ఇదే టోర్నీలో భారత ఆటగాడు లక్ష్య సేన్ కూడా క్వార్టర్ ఫైనల్‌కు చేరి దేశానికి గర్వకారణంగా నిలిచాడు. వరుస విజయాలతో భారత బ్యాడ్మింటన్ శక్తిని ప్రపంచానికి చాటుతున్న సింధుపై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP. Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.